## క్లుప్తంగా


### ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తా



సల్లా శివశంకర్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్యవైశ్య మహిళా మండలి నాయకులు

పలమనేరు: జిల్లాలోని ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులుగా ఇటీవల నియమితులైన సల్లా శివశంకర్ తెలిపారు. ఆ మేరకు మంగళవారం పలమనేరుకు విచ్చేసిన ఆయనకు స్థానిక ఆర్యవైశ్య మహిళా విభాగం ఘనంగా స్వాగతం తెలిపి సన్మానించింది. ఆయన మాట్లాడుతూ వైశ్య కుటుంబాల్లోని పేదల కోసం తాము గట్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం నాయకులు రమ్య, సురేఖ, గీతావాణి పాల్గొన్నారు.

### ధ్యానముద్రలో వానరం



కాకి బొమ్మపై ధ్యానం చేస్తున్న వానరం

పలమనేరు: పట్టణ సమీపంలోని శనీశ్వరాలయం వద్ద వానరం ధ్యానముద్రలో దర్శనమిచ్చింది. శనీశ్వరుని వాహనమైన కాకి బొమ్మపై వానరం కూర్చొని ధ్యానం చేస్తుండగా ఆలయానికి వెళ్లిన భక్తులు ఆ దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్లలో బంధించి మంగళవారం సోషల్ మీడియాలో పెట్టారు. ధ్యానముద్రలో కనిపిస్తున్న ఆ వానరాన్ని చూసిన జనం వైరల్ చేస్తున్నారు.

### ఏఎంసీ చైర్మన్ కోసం పలువురి పోటీ



పలమనేరు ఏఎంసీ కార్యాలయం

పలమనేరు: నియోజకవర్గంలో ఎమ్మెల్యే తర్వాత ప్రొటోకాల్ ఉన్న అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవికి పలువురు పోటీపడుతున్నారు. ఏఎంసీ చైర్మన్‌కు అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాల్లో సముచిత స్థానం ఉంటుంది. దీంతో తాజాగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకుల కన్ను దీనిపై పడింది. త్వరలో ఈ నియామకం జరగ నున్న నేపథ్యంలో నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ ఏఎంసీ చైర్మన్‌గా ఉన్న హేమంత్‌కుమార్ రెడ్డి ఇటీవల రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో అధికార పార్టీ ఈ పోస్టును భర్తీ చేయనుంది. ఇప్పటికే ఈ పోస్టుపై పెద్దపంజాణికి చెందిన ఓ టమాటా వ్యాపారి, బైరెడ్డిపల్లెకి చెందిన సీనియర్ నేత, గంగవరానికి చెందిన ఆ పార్టీ మాజీ జెడ్పీటీసీ, పలమనేరు రూరల్ మండలానికి చెందిన ఇద్దరు బరిలో ఉన్నట్టు సమాచారం.

### మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: మండలంలోని తులసినాయనపల్లె వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని ప్రిన్సిపల్ ఎం.డి.కె.వి లత తెలిపారు. 7వ తరగతిలో 6 సీట్లు, 8వ తరగతిలో 5, 9వ తరగతిలో ఒక్క సీటు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకుంటే రిజర్వేషన్ల ఆధారంగా సీట్ల భర్తీ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

### మారెమ్మకు ప్రత్యేక అలంకారం



పూజలందుకున్న మారెమ్మ

పుంగనూరు: పట్టణంలోని శ్రీ విరూపాక్షి మారెమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై, నిమ్మకాయలు, నెయ్యితో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

# పలమనేరు చుట్టూ భారీ వెంచర్లు

- అమాంతం పెరిగిన భూముల విలువ
- ఇప్పటికే 50 వెంచర్లు ఉండగా, మరో 20 ఏర్పాటు
- ఓవైపు ఎక్స్‌ప్రెస్ హైవే, మరోవైపు బుల్లెట్ ట్రైన్ మార్గాలే కారణం



పట్టణానికి సమీపంలో నిర్మిస్తున్న ఎక్స్‌ప్రెస్ హైవే

పలమనేరు: మొన్నటి దాకా తమ వద్ద ఉన్న డబ్బును బ్యాంకులో డిపాజిట్లు చేసుకోవడం, లేదా బంగారాన్ని కొనుగోలు చేయడం, వడ్డీలకు తిప్పడం చేస్తుండేవారు. అయితే భూములపై నగదును పెట్టుబడిగా పెడితే మంచి రాబడి వస్తుండడంతో చాలామంది భూములు, స్థలాల కొనుగోళ్లపై ఆసక్తిని చూపుతున్నారు. పలమనేరు ప్రాంతంలో చెన్నై- బెంగళూరు ఆరులేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే, బుల్లెట్ ట్రైన్, ఇండస్ట్రియల్ కారిడార్లు ఏర్పాటవుతుండడంతో స్థానికులే కాదు పొరుగు రాష్ట్రాల వారి కన్ను ఇక్కడి భూములపై పడింది. దీంతో పలమనేరు చుట్టుపక్కల భారీగా వెంచర్లు వెలుస్తున్నాయి.

**భూముల దశ తిరిగింది**

మొన్నటిదాకా ధరలు తక్కువగా ఉన్న భూములు ఎక్స్‌ప్రెస్ హైవే కారణంగా అమాంతం పెరిగాయి. దీనికి తోడు ఇదే మార్గానికి సమీపంలో ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ మార్గం రావడంతో భూముల ధరలకు ఊహించిన రీతిలో రెక్కలొచ్చాయి. మరోవైపు ఇక్కడ రెండువేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఇప్పటికే భూములను గుర్తించారు. పలమనేరు పట్టణం అటు బెంగళూరుకు ఇటు చెన్నైకి మధ్యలో రోడ్ కనెక్టివిటీ ఉండడం ఓ కారణం. ముఖ్యంగా ఇక్కడి వాతావరణం ఎండా కాలంలోనూ చల్లగా ఉంటుంది. ఇక్కడికి ఉద్యోగాలు చేసేందుకు వచ్చిన వారు సైతం ఇక్కడే సెటిల్ అవుతున్నారంటే దానికి వాతావరణమే కారణం.

**ఎకరా భూమి రూ.30 లక్షలు**

ఇక్కడ ఎక్స్‌ప్రెస్‌హైవే కోసం భూములు కోల్పోయిన రైతులకు అక్కడ జరిగిన మూడేళ్ల పాటు క్రయవిక్రయ లావాదేవీల మేరకు ప్రభుత్వం ఎకరాకు రూ.20 నుంచి రూ.25 లక్షల వరకూ రైతులకు నష్టపరిహారాన్ని అందించింది. దీంతో రైతులు ఎకరా భూమిని ఇదే ధరకు విక్రయాలకు పెట్టారు. మరోవైపు ఇక్కడి భూములను పొరుగు రాష్ట్రాల వారు ముందుగానే కొనాలనే తాపత్రయంగా రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఆయా ప్రాంతాన్ని బట్టి కొనుగోళ్లు చేసేశారు. ఫలితంగా భూముల ధరలు అమాంతం పెరిగాయి. ఇక డీకేటీ భూములను సైతం సెటిల్‌మెంట్‌గా చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో డీకేటీ భూముల ధరలు సైతం పెరిగాయి.



పలమనేరు మున్సిపాలిటీ వ్యూ

**జోరుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం**

ప్రస్తుతం పట్టణ జనాభా 60 వేలు దాటింది. పట్టణం 17.76 చదరపు కిలోమీటర్ల దాకా వ్యాపించి ఉంది. భవిష్యత్తులో మున్సిపల్ పరిధి సైతం పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే టౌన్‌ప్లానింగ్ శాఖ ఇందుకు అవసరమైన కసరత్తు పూర్తిచేసి మ్యాప్‌ను రూపొందించింది. ఈ నేపథ్యంలో పట్టణం చుట్టూ ఇప్పటికే 50 దాకా వెంచర్లుండగా మరో 20 దాకా సిద్ధమవుతున్నాయి. పట్టణంలో సుమారు 400మంది దాకా రియల్ బ్రోకర్లున్నారంటే ఇక్కడి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఎలా సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. మొన్నటి వరకు అడుగు విలువ రూ.600 నుంచి 1000 వరకు ఉండగా ప్రస్తుతం రూ.1500 నుంచి రూ.4వేలకు చేరుకుంది. ఇక హైవేలకు ఆనుకుని ఉంటే ధర మరింత డిమాండ్ ఉంది.

**పల్లెల్లోనూ పెరిగిన భూముల ధరలు**

ఎక్స్‌ప్రెస్ హైవే పనులు శరవేగంగా సాగతున్నాయి. ఎక్స్‌ప్రెస్ హైవేకి సమీపంలోనే కాస్త అటూ ఇటూగా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ సుమారు 80 కిలోమీటర్ల మేర ఉంటుందని స్థానికంగా నిర్మించిన బెంచి మార్కులను బట్టి తెలుస్తోంది. ఆ మేరకు పలమనేరు నియోజకవర్గంలోని వీకోట, బైరెడ్డిపల్లి, పలమనేరు, పూతలపట్టు నియోజకవర్గంలోని బంగారుపాళెం, చిత్తూరు నియోజకర్గంలోని గుడిపాల మండలాల మీదుగా ఈ మార్గం తమిళనాడులోకి ప్రవేశిస్తుంది. ఈ ప్రాంతాల్లోని గ్రామాల్లోనూ భూముల ధరలు పెరిగాయి. గతంలో గ్రామాల్లో ఎకరా సెటిల్‌మెంట్ ధర రూ.7లక్షలు ఉండగా ఇప్పుడు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు చేరింది.

**భలే డిమాండ్ వచ్చింది**



మొన్నటి వరకు మా ప్రాంతంలో ఎకరా వ్యవసాయ భూమి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలదాకా పలికేది. ఎక్స్‌ప్రెస్ హైవే, బుల్లెట్ ట్రైన్, డీకేటీలను సెటిల్‌మెంట్ల కారణంగా ఉన్నట్టుండి భూముల ధర పెరిగింది. బయటి రాష్ట్రాలనుంచి వచ్చి ఇక్కడ భూములు కొంటున్నారు. దీంతో ఈ భూములకు భలే డిమాండ్ వచ్చింది.

– గోవిందరెడ్డి, బేరుపల్లి, పలమనేరు మండలం

**భూముల కొనుగోళ్లు పెరిగాయి**



బ్యాంకులో డిపాజిట్లు చేస్తే ఇచ్చే వడ్డీ తక్కువ. చీటీలేస్తే అవి ఉంటాయో ఎత్తిపోతాయో తెలియని అయోమయం. అందుకే డబ్బున్నవారందరూ భూములు, సైట్లు కొనేందుకు ఇష్టపడుతున్నారు. భూములపై పెట్టుబడి పెడితే అది పెరిగేదేగానీ తగ్గేది లేదు. స్థానికంగా భూముల ధరలు కొనే పరిస్థితి కనబడలేదు. భూముల కొనుగోళ్లు మాత్రం పెరుగుతున్నాయి.

– గేట్ బాబు, పలమనేరు

## టీడీపీ నాయకుల దాడులు దారుణం



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: ప్రశాంతతకు నిలయమైన మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ నాయకులు ప్రభుత్వ ఆస్తులు, శిలాఫలకాలను ధ్వంసం చేయడం దారుణమని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లోని మంగళవారం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ వద్ద మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి టీడీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను, అడ్డుకట్ట వేసి వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్లో ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా మండలంలోని బీసీ పల్లె ఎంపీటీసీ నారాయణ స్వామిపై టీడీపీ నాయకులు మంగళవారం నిష్కారణంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. అంతకు ముందు మండలంలోని జెడ్పీ క్యాంపు కార్యాలయం వద్ద స్థానిక ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మండలంలో శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ, ఏ ప్రభుత్వంలోనూ ఇలాంటి దారుణాలు జరగలేదని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులకు తావు ఉండకూడదన్నారు. మండలంలో రాజకీయ పార్టీలతో పనిలేకుండా అభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. మండలంలోని జవునపల్లి, కొత్తూరు గ్రామాల్లో శిలాఫలకాలను రాత్రుల్లో ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. మొదట మండలంలో జరుగుతున్న దాడులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసులకు నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు.

**ఇలాంటి దాడులను ప్రోత్సహించరాదు**



విలేకర్లతో మాట్లాడుతున్న పీఎస్ నాగరాజు

వి.కోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిపై పోలీసుల వెంటనే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, సోమవారం రాత్రి మండలంలోని కే కొత్తూరు గ్రామంలో ఇటీవ నిర్మించిన సీసీ రోడ్ల శిలాఫకాన్ని టీడీపీ నాయకులు ధ్వంసం చేశారని తెలిపారు. ఇలాంటి నీతిమాలిన చర్యలు ఏ ప్రభుత్వంలోనూ కొనసాగలేదని దీన్ని సభ్య సమాజం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇలాంటి విధ్వంసకర దాడులు చేసిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

### ఆస్పత్రి కమిటీ చైర్మన్ కల్యాణ్ భరత్ రాజీనామా

చౌడేపల్లె: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ కల్యాణ్‌భరత్ పదవికి రాజీనామా చేసినట్లు మంగళవారం తెలిపారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానున్న నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేసినట్లు కల్యాణ్ భరత్ పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

### దండుమారెమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెలో దండుమారెమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గంగమ్మ జాతర కార్యక్రమంలో భాగంగా ఉదయం అంబళ్లు, సాయంత్రం పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారి మూల విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

**బంగారుపాళెం దళితవాడలో..**

బంగారుపాళెం దళితవాడలో మంగళవారం గంగమ్మ జాతర సందర్భంగా ఉదయం అంబళ్లు, సాయంత్రం పొంగళ్లు సమర్పించారు. రాత్రికి అమ్మవారి శిరమాను గ్రామ వీధుల్లో ఊరేగించి నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువు దీర్చనున్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడాలి



మండల సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న సర్పంచ్ నాగరాజు

గుడుపల్లె: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం ఎంపీపీ వరలక్ష్మి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని గుండ్లసాగరం గ్రామ పంచాయతీ పరిధిలో చెరువులు, దేవాలయ భూములతోపాటు వంకలు, గుట్టలు పూర్తిగా అన్యాక్రాంతం అవుతున్నాయని సర్పంచ్‌నాగరాజు పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన భూములను సర్వే చేసి కాపాడాలన్నారు. గ్రామాల్లో మంచి నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీధుల్లోని మురుగు నీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్ వేయాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూడా లని కోరారు. జాబ్ కార్డులు ఉన్న వారందరికీ ఉపాధి హామీలో పనులు కల్పించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, ఈవోపీఆర్‌డీ శంకర్, నాయకులు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



కొత్తయిండ్లులో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యాధికారి అరుణ్‌కుమార్

బైరెడ్డిపల్లె : వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొత్తయిండ్లు గ్రామంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో కలుషిత నీరు తాగి శశికుమార్, రామక్క, ఈశ్వరప్ప, తిప్పయ్య, మంగమ్మ, అఖిల తదితరులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో స్పందించిన వైద్య సిబ్బంది గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటే వ్యాధులను కట్టడి చేయవచ్చన్నారు. వర్షాలు కురవడంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించి దోమలు విపరీతంగా వృద్ధి చెంది విషజ్వరాలు, డెంగీ, మలేరియా, అతిసారం, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో ఆశా వర్కర్లకు వైద్యాధికారి విజయ్‌చంద్ర ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

## ఆశా వర్కర్లపై పనిభారం తగ్గించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ ఉపాధ్యక్షుడు గంగరాజు

చౌడేపల్లె: ఆశా వర్కర్లపై పనిభారం తగ్గించాలని తమ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండు చేశారు. లద్దిగం పీహెచ్‌సీలో మంగళవారం ఆశాడే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పనిభారం తగ్గించి కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కొత్త ఫోన్లు ఇవ్వాలని, ఆశల సమస్యలను తక్షణమే స్పందించి ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి డాక్టర్ చంద్ర పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం ఏర్పాటు**

చౌడేపల్లె, లద్దిగంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆశా వర్కర్ల సంఘ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గంగరాజు వెల్లడించారు. చౌడేపల్లె ఆశ కార్మికుల సంఘం అధ్యక్షురాలిగా అనూరాధ, కార్యదర్శి రత్నమ్మ, ఉపాధ్యక్షురాలు శాంతమ్మ, సహాయ కార్యదర్శి నాగమ్మ, కోశాధికారి లక్ష్మీదేవితోపాటు మరో పదిమంది కమిటీని ఎన్నుకున్నారు. లద్దిగం పీహెచ్‌సీ పరిధిలోని సంఘ అధ్యక్షురాలిగా లీలా కార్యదర్శి సావిత్రి, ఉపాధ్యక్షురాలు హేమలత, కోశాధికారి సుబ్బమ్మతోపాటు మరో ఏడుగురిని ఎన్నుకున్నారు.

## కొండెక్కిన కూరగాయల ధరలు



వీఎస్.అగ్రహారంలో కూరగాయల దుకాణం

ఐరాల/గుడిపాల: కూరగాయల ధరలు మండిపోతున్నాయి. సాధారణంగా వేసవిలో టమాటాల ధర మాత్రమే పెరగడం చూస్తుంటాం. కానీ ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటడంతో సామాన్య ప్రజలు వాటిని కొనలేని పరిస్థితిలో ఉన్నారు. రోజురోజుకూ ధరలు పెరిగిపోతూ ఉండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కూరగాయల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులకు భారంగా మారింది. వీటిని కొనలేం తినలేం అన్న పరిస్థితి నెలకొంది. రెండు వారాల క్రితానికి, ఇప్పటికి కూరగాయలు రెట్టింపు ధరలు పెరిగాయని సామాన్యులు వాపోతున్నారు. రెండు వారాల క్రితం వరకు టమాటా కిలో రూ.20 ఉండగా ప్రస్తుతం రూ.60కు చేరింది. మిర్చి కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం రూ.120కు పెరిగింది. బెండ కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం కిలో రూ.80కి పెరిగింది. బీన్స్ కిలో రూ.50 ఉండగా ప్రస్తుతం కిలో రూ.100కు పెరిగింది. చిక్కుడు కిలో.40 ఉండగా రూ.80, బీరకాయ కిలో రూ.40 ఉండగా రూ.80కు పెరిగింది. రెండు వారాల వ్యవధిలోనే కిలోకు రెట్టింపు ధరలు తీసుకుంటున్నారు. వేసవిలో కూరగాయల దిగుబడి సరిగా లేకపోవడంతో కూరగాయల కొరత ఏర్పడింది. దీంతో వ్యాపారస్తులు అధిక ధరలు పెట్టి కూరగాయలను కొనుగోలు చేసి దుకాణాల వద్ద వినియోగదారులకు అధిక ధరలకు విక్రయిస్తున్న పరిస్థితి ఏర్పడింది.

## నేత్రపర్వం.. గరుడోత్సవం



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

యాదమరి(పూతలపట్టు): వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఇంద్రపురి వరదరాజులస్వామి గరుడోత్సవం నేత్రానందంగా సాగింది. ఉదయం మూలస్థానంలోని వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుడికి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేశారు. ప్రత్యేకంగా అలకరించి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు స్వామివారు గరుడ సేవలో ఊరేగారు. వస్తున్న స్వామివారికి భక్తులు నీరాజనాలు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి కల్పవృక్ష సేవలో స్వామివారు భక్తులు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బుధవారం ఉదయం హనుమంతవాహనం, రాత్రి గజ వాహనం, అలాగే కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

## నేడు చంద్రబాబు ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారం





కుప్పం: తరలుతున్న టీడీపీ నేతలు, పలమనేరు: బస్సులకు పచ్చజెండా ఊపుతున్న అధికారులు

గంగవరం: రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణస్వీకారం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రితో పాటు నూతన మంత్రివర్గ ప్రమాణస్వీకారం ప్రత్యక్షప్రసారాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గంగవరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**ప్రమాణ స్వీకారాన్ని జయప్రదం చేయండి**

పలమనేరు: ఏపీ సీఎంగా నేడు ప్రమాణస్వీకారం చేయనున్న చంద్రబాబు కార్యక్రమాన్ని ఇక్కడి మున్సిపల్ కార్యాలయంలో వీక్షించేలా ఏర్పాటు చేశామని టీడీపీ పట్టణ కన్వీనర్ కుట్టి, నాయకులు చాన్‌బాషా, సుబ్రమణ్యం గౌడు, గిరిధర్, ఖాజా తదితరులు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు.

**తరలిన టీడీపీ నేతలు**

నేడు విజయవాడలో నిర్వహించనున్న సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి నియోజకవర్గం నుంచి నాలుగు ప్రత్యేక బస్సుల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు పలమనేరు తహసీల్దార్ కార్యాలయం నుంచి బయల్దేరారు. ఈ బస్సులకు స్థానిక తహసీల్దార్ రంగనాయకులు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని మండలాలనుంచి ప్రజలను తరలించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

**తరలిన టీడీపీ నాయకులు**

కుప్పం: చంద్రబాబు ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని కుప్పం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నియోజకవర్గానికి 28 బస్సులు కేటాయించడంతో టీడీపీ కార్యకర్తలు, నాయకులు ప్రమాణ స్వీకారానికి పయనమయ్యారు. కుప్పం శాసన సభ్యుడిగా 8వ సారి, ఆంధ్ర రాష్ట్రానికి నాలుగో సారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు విజయవాడలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీంతో కుప్పం నియోజకవర్గం నుంచి బస్సులు మినహా కార్లు, రైలు మార్గం ద్వారా వేల సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లారు. ప్రమాణ స్వీకారం సందర్భంగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయాలను విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం ప్రజలు వీక్షించేందుకు సౌకర్యంగా అక్కడక్కడ టీవీలు ఏర్పాటు చేయనున్నారు.

**ఎల్ఈడీ టీవీల్లో ప్రసారం**

పుంగనూరు: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రజలు నేరుగా తిలకించేందుకు ఎల్ఈడీ టీవీలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార మహోత్సవాన్ని ప్రజలు తిలకించేందుకు మున్సిపల్ మీటింగ్ హాల్‌లో టీవీలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో విజయవాడకు తరలివెళ్లారు. పట్టణంలో పలు చోట్ల చంద్రబాబు ప్రమాణ స్వీకరోత్సవ బ్యానర్లను ఏర్పాటు చేశారు.